నగరం నడిబొడ్డులో అత్యాధునిక నగల షాపు 'కబీర్‌లాల్ జ్యూవెలరీ షాప్' దాని యజమాని కబీర్‌లాల్. నగరంలోని ధనిక వర్గాలకు అత్యంత ప్రీతికరమైన షాపు కబీర్‌లాల్ జ్యూవెలర్స్. రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో జనమంతా సద్దు మణిగిన తర్వాత కబీర్‌లాల్ స్వయంగా దగ్గరుండి షట్టర్స్ అన్నీ వేయించి సెక్యూరిటీ గార్డ్‌కు జాగ్రత్తలు చెప్పి కారెక్కాడు. బాగా అలసి ఉన్నాడు కబీర్. డ్రైవర్ ఎటెళ్లాలి అన్నట్లుగా అతని వైపు చూసాడు.



# వజ్రాల దొంగ

## ఆదిత్య

'బాంద్రా' అని చెప్పి కారు సీటుకు జారగిల బడ్డాడు. నడివయసు కబీర్‌కు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య పద్మిని చర్చిగేట్ దగ్గరి ఫ్లాట్‌లో ఉంటుంది.

చిన్న భార్య రాగిణి బాంద్రాలో ఉంటుంది. ఇప్పుడు కబీర్‌లాల్ బయలుదేరింది రాగిణి ఇంటికి.

కాలింగ్ బెల్ మోగగానే తలుపు తీసింది రాగిణి.

తెల్లని నైలాన్ నైటీతో తలనిండా మల్లెపూలతో ఎదురొచ్చిన రాగిణిని చూస్తూనే అలసటస్థానంలో హుషారు పుట్టుకొచ్చింది కబీర్‌కు. అతని హుషార్‌ను రెట్టింపు చేయడానికన్నట్టుగా కబీర్‌ను తన కౌగిలిలో బంధించింది. ఆమె గుండెల మీద 'పాయిజన్ సెంట్' గుభాళింపు అతన్ని వివశుణ్ణి చేసింది. నైటీలోని అందాలు అతణ్ని కిక్కెస్తున్నాయి.

రాగిణిని మరింత బిగువుగా కౌగిలించు కున్నాడు. కౌగిలిలో కరిగిపోతూనే భోజనం వడ్డించానంది.


''నిన్ను చూస్తూనే కడుపు నిండిపోయింది. అందాల విందు ఆరగిస్తా...'' అంటూ మరో మాటకు అవకాశం వివ్వకుండా రాగిణిని ఎత్తుకొని బెడ్‌రూమ్‌లోని బెడ్‌పైకి చేర్చాడు కబీర్‌లాల్.

* * *

తెలవారుతుండగా కబీర్ సెల్ మ్రోగింది. బద్ధకంగా సెల్ ఆన్ చేసి

''హల్లో.....'' అన్నాడు కబీర్‌లాల్ వింటూనే ఒక్క ఉదుటున బెడ్ మీది నుండి లేచాడు. అతని బద్ధకం ఎగిరిపోయింది.

''ఇదిగో వచ్చేస్తున్నా....'' అంటూ పక్కనే ఉన్న రాగిణిని కూడా లేపకుండా హుటాహుటిన కారు తీసుకొని కొలాబాలో ఉన్న తన షాపుకు బయలు దేరాడు.



అతను చేరుకునే సరికి షాపు ముందు గుమిగూడి ఉన్నారు. కబీర్‌ను చూస్తూనే ఆ ఏరియా ఎస్.ఐ. త్రివిక్రమ్ మాట పూర్తి కాకుండానే–

''సెక్యూరిటీ చందన్‌సింగ్ ఏం చేస్తున్నాడు...'' అటూ, ఇటూ చూస్తూ అడిగాడు కబీర్‌లాల్.

''మీ సెక్యూరిటీగార్డ్ చందన్ సింగ్‌ను హత్య చేసారు...'' అంటూ కొద్ది దూరంలో పడి ఉన్న చందన్‌సింగ్ శవాన్ని చూపించాడు. ఆ శవాన్ని చూస్తూనే విస్తుపోయాడు కబీర్‌లాల్.

''అసలీ దారుణం ఎలా జరిగింది... రాత్రి నేను దగ్గరుండి మరీ తాళాలు వేసాను....''

''అదే మా టీం సభ్యులు పరిశీలిస్తున్నారు....''

వీళ్ళిద్దరి సంభాషణ ఇలా సాగుతుండగా 'క్లూస్ టీం సభ్యుడు రాందత్ వారిని చేరి


''సార్ దుండగులు వెనకవైపు రెండో అంతస్థులో ఉన్న ఎ.సి. ప్లాంట్‌ను తొలగించుకొని లోనికి ప్రవేశించినట్టు తెలుస్తోంది.''

మరో విచిత్రం వాళ్ళు బంగారు ఆభరణాలను అసలు ముట్టుకోలేదు. మరేం దోచుకున్నారో మీరు చూస్తే గాని తెలీదు'' అనడంతో ఆ మాట వింటూనే కబీర్‌లాల్ ఒక్క ఉదుటున షాపులోకి పరుగెత్తాడు రెండో అంతస్తులో ఉన్న తన ఆఫీసు రూమ్ చేరుకున్నాడు. అక్కడ లైఫ్ సైజ్‌లో ఉన్న ఉదయిస్తున్న సూర్యుడి పెయింటింగ్ ఉంది. తన టేబుల్ మీద ఉన్న కాలింగ్‌బెల్‌ని నొక్కగానే పెయింటింగ్ పైకి జరిగింది. దాని వెనుక ఓ ర్యాక్ కనిపించింది దాన్ని తన దగ్గరున్న తాళంతో తెరవ బోయాడు కాని అతను ఆ రాక్ పై చెయ్యి వెయ్యగానే కిర్రుమంటూ తెరుచుకొంది.

లోపల ఎర్రటి ముఖ్‌మల్ గుడ్డతో ఉన్న బాక్స్‌ను బయటకు తీసి ఓపెన్ చేసాడు కబీర్. ఓపెన్ చేస్తూనే ఘొల్లుమన్నాడు.

''అమ్మో నాశనమయిపోయింది. అంతా సర్వనాశనమయి పోయింది. ..పాతిక కోట్లు విలువ చేసే వజ్రాలు దొంగలెత్తుకు పోయారు... దేవుడా....'' అంటూ పక్కనున్న సోఫాలో కుప్పకూలాడు.

''ఇలాంటప్పుడే మీరు ధైర్యంగా ఉండాలి.




వజ్రాలను మీరు చాలా సేఫ్‌గా దాచినట్లుంది అని దాచిన ప్లేస్ మీకు కాక ఇంకెవరికయినా తెలుసా....?''

అడిగాడు త్రివిక్రమ్.

''నా కుటుంబ సభ్యులకు, మా మానేజర్ తివారీకి తప్ప ఇంకెవ్వరికీ తెలిసే అవకాశం లేదు.''

''అయితే మీ మ్యానేజర్ తివారీని పిలిపించండి.....'' అన్నాడు ఎస్. ఐ త్రివిక్రమ్.

''మా మ్యానేజర్ తివారి తన కూతురి పెళ్ళికి గాను రెండు వారాలు సెలవు మీద ఉన్నాడు....'' చెప్పాడు కబీర్ లాల్.

''పోనీ మీకు ఎవరి మీదైనా అనుమానం ఉందా....?''

''చెప్పలేను'' అంటూ తలూపాడు.

క్ల్యూస్ టీం షాపు అణువణువు శోధించ సాగారు. రాందత్ ఒక్కసారి ఏదో గుర్తొచ్చినట్టుగా

''అన్నట్టు మీ షాపులో సి.సి. కెమెరాలు ఉండాలిగా.....'' అడిగాడు.

కబీర్‌లాల్ ''ఆ అవును.... ఆ సంగతే మరిచిపోయా....'' అనడంతో

అందరూ బిలబిల మంటూ సెక్యూరిటీ రూమ్‌లో చేరి టీవీ ఆన్ చేసి చూడసాగారు. అన్ని రూములల్లోని దృశ్యాలు ఒకదాని వెనుక ఒకటి దృశ్యమాలికలా కనిపించసాగాయి. స్క్రీన్ మీదే డిజిటల్ క్లాక్ సెకనలతో సహా టైమ్ చూపిస్తోంది.

చివరి దృశ్యం మూడు గంటల సమయంలో రికార్డ్ అయింది. ఆ తర్వాత ఒక్కసారిగా స్క్రీన్ బ్లాంక్ అయిపోయింది.

ఏమీ కనిపించలేదు.

''షిట్... ఏం జరిగింది....'' పిడికిలితో బల్ల మీద గుద్దాడు ఎస్. ఐ త్రివిక్రమ్.

''నా ఖర్మ సార్....'' అంటూ నుదిటి మీద రెండు చేతుల్తో బాదుకోసాగాడు కబీర్‌లాల్.

''బాహుశా కరెంట్ ఆఫ్ అయి ఉంటుంది''.

ఊహిస్తూ అన్నాడు రాందత్.

ఈ లోగా పోలీసులు చందన్‌సింగ్ శవాన్ని పోస్టుమార్టంకు గాను సిటీ సివిల్ హాస్పిటల్‌కు తరలించారు.

కబీర్‌లాల్ జ్వెలర్స్ ఆనుకుని ఉన్న పాత బిల్డింగ్‌ను కూలగొట్టి సరికొత్త షాపింగ్ మాల్ నిర్మాణం జరుగుతోందక్కడ.

అక్కడి నుండి కబీర్‌లాల్ షాపులోకి రావడం సులభం.

విచిత్రం ఏవిటంటే ఈ రెండు బిల్డింగ్‌లకు సెక్యూరిటీగార్డ్ ఒక్కడే అతనే చందన్‌సింగ్.


కబీర్‌లాల్‌తో వజ్రాల దొంగతనం కేసు బుక్‌చేసుకొని అక్కడినుండి నిష్క్రమించాడు. ఎస్. ఐ త్రివిక్రమ్.

* * *

కబీర్‌లాల్ పెద్ద భార్య పద్మినిని విచారణకై ఆమెను కలుసుకున్నాడు ఎస్. ఐ. త్రివిక్రమ్.

''మీ షాపులో దొంగతనం జరిగిన రాత్రి మీరెక్కడున్నారు....'' అడిగాడు ఎస్. ఐ.

''ఇంకెక్కడుంటాను ఈ కొంపలోనే పడి ఏడుస్తున్నాను. ఏనాడైతే ఆ వగలాడి ఆయన్ని ఒళ్ళో వేసుకుందో ఆనాటి నుండి ఈ ఇల్లే నాకు కైలాసం, వైకుంఠం అన్నీను....'' ఆమె మాటల్లో



రాగిణి పట్ల గల ఈర్ష్యను గుర్తించాడు త్రివిక్రమ్.

"పోనీ కబీర్‌లాల్ ఎక్కడున్నాడు....?''

''నా నోటితో చెప్పించాలనా... ఆ రాగిణి కొంపలోనే....''

ఆమె ప్రవర్తన విచిత్రంగా తోచిందతనికి పాతిక కోట్ల వజ్రాలు పోయాయన్న బాధగాని, దిగులుగాని ఇసుమంతయినా ఆమె ముఖంలో కనిపించలేదు.

ఇంక ఆమెను పలకరించి లాభం లేదనుకొని అక్కడి నుండి బయలుదేరి రాగిణి ఇంటికొచ్చాడు త్రివిక్రమ్.

ఆ సమయంలో రాగిణి తీరిగ్గా కూర్చుని తన గోళ్ళను నెయిల్‌పాలిష్ వేసుకొంటోంది. ఎస్. ఐ. ని చూస్తూనే

"రండి...రండంటూ'' ఆదరంగా ఆహ్వానించింది.

సోఫాలో కూర్చుని రాగిణిని నిశితంగా పరిశీలించాడు. టీపాయ్‌పై నెయిల్ కట్టర్, ఎర్రరంగు నెయిల్‌పాలిష్, ఓ పేపర్‌లో కట్ చేసిన గోళ్ళు కూడా ఉన్నాయి.

"ఎస్. ఐ. గారూ దొంగల జాడ ఏమైనా తెలిసిందా...?'' అంటూ అడిగింది రాగిణి. ఆమె చేతికున్న ఎర్రరంగు గాజుల్ని చూస్తూ

''చాలా దగ్గరగా వచ్చాం... వజ్రాలు దొంగలించిన గదిలో ఎవరివో అడుగు జాడలు స్పష్టంగా కనిపించాయి. ఆ అడుగుజాడలు ఎవరివో తెలిస్తే దొంగలు దొరికినట్లే....'' అని చెబుతూ-

"కొంచెం మంచినీళ్ళు....'' కావాలన్నట్లుగా సైగ చేసాడు త్రివిక్రమ్.

"ఓహ్ సారి....'' అంటూ లేచి వెళ్ళింది. ఆమె వెళ్ళిన రెండు నిమిషాల్లో తను చేయాల్సిన పనిని నిర్విఘ్నంగా పూర్తి చేసి రాగిణి నుండి సెలవు తీసుకున్నాడు త్రివిక్రమ్.

* * *

చందన్ సింగ్ పోస్ట్ మార్టం రిపోర్ట్ వచ్చింది అతని పిడికిట్లో పొడవైన కేశాలు కనిపించాయి.

అంతే కాదు చందన్‌సింగ్‌ను ఎవరో గొంతుపిసికి చంపేసారని రిపోర్ట్‌లో ఉంది.

అప్పుడే అక్కడికొచ్చిన కబీర్‌లాల్-

"ఏవైనా ఆచూకీ తెలిసిందా....?'' అంటూ ఆదుర్దాగా అడిగాడు.


"ఆ పని మీదే ఉన్నాం...."

"ఈ కేసు తాలుకు ఎఫ్. ఐ. ఆర్. కాపీ ఒకటి నాకిస్తే ఇన్స్యూరెన్స్‌కు క్లయిమ్ చేస్తాను....'' అంటూ అడిగాడు.

"అలాగే.....'' అంటూ తన అసిస్టెంట్‌ను పిలిచి ఎఫ్. ఐ. ఆర్ కాపీ ఒకటి కబీర్‌కు అందజేసాడు.

దాన్ని చూడగానే కబీర్ మొహంలో కొంచెం జీవకళ వచ్చింది.

అతను వెళ్ళిపోయిన కొద్దిసేపటికే క్లూస్ టీం రాందత్ ఎస్. ఐ.ని కలుసుకొని తమ పరిశోధన రిపోర్ట్ అందజేసాడు.




"ఆ గదిలో దుమ్ములోని అడుగుజాడలు ఎవరివి.....?'' అడిగాడు త్రివిక్రమ్.

"అవి నిజమైన అడుగు జాడలు కావుసార్. కేవలం మనల్ని తప్పుదారి పట్టించడానికి అప్పటికప్పుడు అక్కడి దుమ్మును సేకరించి దొంగలు సృష్టించిన అడుగు జాడలు....అవి''

"యూ... ఆర్ రైట్... దొంగలు తాము తెలివిగా చేసామనుకున్న ఆ పొరబాటే వాళ్ల పాలిట శాపమయింది''అన్నాడు త్రివిక్రమ్.

* * *

కబీర్ లాల్ అసహనంగా తన గదిలో పచార్లు చేస్తున్నాడు. విలువైన వజ్రాల ఆచూకీ తెలియనేలేదు. అందుకే విచారంగా కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. పక్కనే రాగిణి కూడా మాటి మాటికి గేటు వైపే చూస్తోంది. ఇంతలో ఓ జీపు దుమ్మురేపుకుంటూ ఇంటి ఆవరణలో ప్రవేశించింది. అందులోనుండి దిగిన మనుషుల్ని చూస్తూనే నివ్వెర పోయారు కబీర్‌లాల్, రాగిణిలు.

ఇన్స్యూరెన్స్ ఏజెంట్లతో బాటు ఎస్. ఐ. కార్తీక్, క్లూస్ టీం రాందత్ కూడా ఉన్నాడు.

"రండి....రండి'' అంటూ ఎదురెళ్ళి-

"మేం నీ ఆహ్వానాన్ని అందుకోడానికి రాలేదు. నిన్ను అరెస్ట్ చేయడానికి వచ్చాం....'' అని ఎస్. ఐ. త్రివిక్రమ్ అనడంతో-

"మీరేం మాట్లాడుతున్నారు....సార్...?'' అమాయకంగా అడిగాడు కబీర్‌లాల్.

"మిస్టర్ కబీర్‌లాల్ మరీ అంతగా నటించకండి. అసలైన వజ్రాల దొంగలు మీరిద్దరే. పదిరోజుల క్రితం మీ ఎ.సి. ప్లాంట్ రిపేర్ చేయించారు కాని దాన్ని సరిగ్గా ఫిట్ చేయలేదని మీ సర్వీస్‌మెన్ చెప్పాడు.''

"ఏప్రిల్ పదహారు రాత్రి రెండుగంటలకు మీరిద్దరూ మీ షాపుకు చేరుకున్నారు. పక్క బిల్డింగ్‌నుండి పైకి చేరి ఎ.సి. ప్లాంట్ తొలగించి ఇద్దరూ లోపలికి చేరారు అన్నీ మీకు తెలిసిన ఆనవాళ్ళే కనుక నిముషాల్లో వజ్రాలు కొట్టేసారు. తిరిగొస్తూ పోలీసుల్ని తప్పుదారి పట్టించడానికి అడుగు జాడలు సృష్టించారు. గదిలోని దుమ్ముని మీ చేతుల్తో ఎత్తి అక్కడక్కడ చల్లారు.''

''సాధారణంగా ఆ దుమ్ములో బంగారు రజను కలిసి ఉంటుంది. ఈ విషయం మాకన్నా మీకే బాగా తెలిసుండాలి. ఆ రజను మీ చేతులకు అంటడమేకాదు మీ గోళ్ళల్లో కూడా చిక్కుకుని ఉంది.''

''అంతే కాదు మిమ్మల్ని గమనించిన చందన్‌సింగ్‌ను చూసి ఇద్దరు కలిసి పీక నులిమారు. చందన్‌సింగ్ గొంతుకు బంగారు రజను అంటుకుంది. ఆ హడావిడిలో రాగిణి ఎర్రరంగు గాజులు చిట్లి కొన్ని గాజుముక్కలు చందన్‌సింగ్ మెడలో చిక్కుకున్నాయి. చందన్‌సింగ్ గుప్పెట్లో రాగిణి వెంట్రుకలు చిక్కాయి.''

''రాగిణి గోళ్ళల్లో బంగారు రజను ఉన్న ఆనవాళ్ళు దొరికాయి. ఇప్పటికీ రాగిణి కుడిచేతికి నాలుగుగాజులు, ఎడమ చేతికి అయిదుగాజులే ఉన్నాయి.''

''ఇదంతా కూడా వజ్రాలకై చేసిన ఇన్స్యూరెన్స్ డబ్బులు సుమారు ముప్పైకోట్లు కొట్టేయాలనే దురాశతో చేసిన పని ఇది....''

అంటూ చెప్పడం ఆపి ఈ సాక్ష్యాలు చాలా అన్నట్లు చూసాడు.

తమ పథకం ఇంత త్వరగా బెడిసికొడుతుందని ఊహించని కబీర్‌లాల్, రాగిణిలు తలొంచుకున్నారు. చందన్‌సింగ్‌ను హత్య చేసిన నేరానికిగానూ ఇద్దరినీ అరెస్ట్ చేసారు.

* * *

మరునాడు ఉదయం ముంబయిలోని అన్ని వార్తా పత్రికల్లోని పతాక శీర్షికల్లో

"పట్టుబడ్డ వజ్రాల దొంగలు. ఇన్స్యూరెన్స్ డబ్బు కోసం సొంత ఇంటికే కన్నాలేసుకున్న వింత దొంగలు....'' అంటూ రకరకాల కథనాలు ప్రచురించారు.

కబీర్‌లాల్ దురాశతో చేసిన పనికి కటకటాల వెనక్కి చేరాడు.

కేసు విచారణలో ఉంది.

★